
గౌరవనీయులైన రచయిత మురళీకృష్ణ గారికి,

నమస్తే. ఇంతకీ ఈవిడెవరా? అని ఆశ్చర్య పోతున్నారా? కాదనుకుంటాను. ఎందుకంటే మీకు నాలాంటి అభిమానులు కోకొల్లలు. అందులో ఓ చిరు అభిమానిని. మీ రచనలు చాలా రచనల్లా సమస్యా పరిష్కారాన్ని చావు లాంటి వాటితో ముగించక, మానవజాతిని జాగృతం చేసేలా, మానవత్వాన్ని, మధుర భావాలనూ తట్టి మేలుకొలిపేలా ఉంటాయి. మీరు ఇటీవల రాసిన కథలు 'అమ్మ', 'మధుర స్మృతి' చాలా బావున్నాయి. సృష్టిలో అమృతాన్ని మించినది అమ్మ ప్రేమేనని, ఆప్యాయతకు, అర్పణకు మారుపేరు అమ్మని, తల్లితండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న నేటి తరానికి 'మాతృదేవోభవ' అని ఎందుకు అంటారో చాలా బాగా చెప్పారు. ఇకపోతే 'మధురస్మృతి' అందరికీ చిన్ననాటి మధురస్మృతులన్నీ నెమరేసుకునేటట్లుంది. అందులో 'మా ఊరు ఒక్కసారి పోయి రావాలి... జ్ఞాపకాల బరువుతో తిరిగి రావాలి...' అనే పాట రిఫరెన్స్‌గా పెట్టారు చూడండీ, అది చాలా బావుంది. మళ్లీ చిన్ననాటి చిలిపి, మధుర భావనల్లో ఒక్కసారిగా మునిగిపోయాను. ఎప్పుడు ఆ పాట వచ్చినా మీ కథే గుర్తుకు వస్తుంది. అంటే మామూలప్పుడు గుర్తురాదని కాదండోయ్...

ఆకాశం నుంచి రాలే నక్షత్రాలు, తెల్లని పొగడ పూలు భూమిపై జాలువారుతున్నట్లు చిన్ననాటి జ్ఞాపకాలన్నీ నా హృదయ ఫలకంపై రాలుతున్న అనుభూతి. వైశాఖ మాసం ఎండల్లాంటి ఇప్పటి రచనల్లో




చల్లటి పన్నీటి జల్లులాంటి మీ కథ సేదదీర్చింది. అన్నీ పొగడ్తలే అనుకుంటున్నారా? నచ్చనివి ఉంటే విమర్శలు కూడా రాస్తానండోయ్. అన్నట్లు నా గురించి నే చెప్పలేదు కదూ... పీజీ చేస్తున్నాను. నవలలు, కథలు, కవితలూ చదువుతుంటాను. ప్రకృతిని ఆస్వాదిస్తూ మీలా దానిని కథల్లో పెట్టలేకపోయే నా అశక్తతను తిట్టుకుంటూ ఉంటాను. ఇప్పటికే చాలా బోర్‌కొట్టి ఉంటాను. మీ తర్వాతి రచనల గురించి నాకు ఒక ఉత్తరం రాస్తారని ఆశిస్తూ...

ఇట్లు,
రవళి

నోట్: అయినా నా పిచ్చిగాని... ఈ ఉత్తరం చదువుతారో లేక చింపి... ఆ... ఆ... సారీ... అనను లెండి.

* * *

ఆ ఉత్తరం చదివాక జవాబు రాయాలనిపించింది మురళీకృష్ణకు. సాధారణంగా చాలా మంది అభిమానులు జవాబు రాయమని కోరినా, ఎవరికీ రాయడు. వారం తర్వాత క్లుప్తంగా రాసిన ఉత్తరానికి జవాబు మళ్లీ వచ్చిందతనికి. ఆమె శైలి ఎందుకో బాగా నచ్చేదతనికి. మనస్సుని దూదిపింజలా ఏ సుదూరతీరాలకో తీసుకెళుతూ, క్షణంలో మళ్లీ ఇహలోకానికి తెస్తూ, చలోక్తులు, చమత్కారాలతో ఎదురుగా మాట్లాడుతున్నట్లే ఉండేది. అసలు ఇంత రచయిత అయినా తనకే అలా రాయడం చేతకాదేమో! అన్పించేది. ఎన్నెన్నో విషయాలు... అసలు ఈమెకింత విజ్ఞానం ఎక్కడ్నుంచి వచ్చిందనిపించేది. ప్రతి విషయాన్నీ అన్నికోణాల నుంచీ చాలా కూలంకషంగా చర్చించేది. అసలు ఉత్తరం రాయడం కూడా ఒక కళేనేమో. ఉత్తరాలు రాయడంలో ఏదైనా అవార్డ్ ఉంటే



నామని సుజనాదేవి

అది తప్పక ఈమెకే వస్తుందని గన్‌షాట్‌గా చెప్పొచ్చు అనుకునేవాడు. అందుకని ఎవరికి జవాబు వ్రాసినా, వ్రాయకపోయినా రవళికి మాత్రం వ్రాసేవాడు. ఆమె రాసిన చమత్కారపు మాటలు గుర్తొచ్చి నవ్వుకునేవాడు. ఉత్తరాలతోనే ఇంతగా ఆకట్టుకున్న ఈమెను... చూస్తే... ఇక కట్టిపడేసేలా ఉంటుందేమో అనుకునేవాడు. మరో ఆరు నెలలు గడిచేసరికి ఉత్తరాల పరిచయమే అయినా ఎన్నో సంవత్సరాల నుంచి స్నేహితులయినంత దగ్గరితనం ఏర్పడిపోయింది ఇద్దరిలో. ఇది క్రమంగా ప్రేమాయణంలోకి దారితీసింది. ఆమె వ్యక్తిత్వం, భావాలు బాగా నచ్చాయతనికి. ఎన్నోసార్లు ఒకసారి చూడాలనుంది – కలుసుకుందాం అని, ఫొటో పంపించమని అడిగినా రూపం, ఆకారం స్నేహానికి, ప్రేమకూ అంత ముఖ్యం అంటారా? అంటూ వాయిదా వేసేది రవళి.

ఒకసారి మురళీకృష్ణకి రవళి ఊర్లోనే స్నేహితుని పెళ్లి ఉండటంతో, రవళిని కూడా కలుసుకోవాలనే కుతుహలంతో తాను ఫలానా

రోజున వస్తున్నట్లు ఉత్తరం రాసాడు. మరుసటి రోజు మార్చినెలలో చివరిరోజు కావటంతో సెలవు దొరకకపోయినా, ఆ రోజు అర్ధరాత్రి వరకు ఫైనాన్షియల్ ఇయర్ క్లోజింగ్‌వర్క్ పూర్తి చేసి, బలవంతాన తెల్లవారి బయల్దేరాడు.

బయల్దేరిన రోజు ఎందుకో ప్రొద్దుట్నుంచీ ఏదో తెలియని వింత అనుభూతితో నిండిపోయిందతని మనస్సు. మార్చినెల అయీ అవకముందే మండుతున్న ఎండలను విసుక్కున్నాడు. చాలా టెన్షన్‌గా ఫీలయ్యాడు. ఇవాళ సాయంత్రంలోగా తను తన నెచ్చెలిని కలుసుకోబోతున్నాడు. ఇన్నాళ్లూ కాగితాలపై చూసిన ఆమె మనస్సును ఈ రోజు దగ్గరికెళ్లి తెలుసుకోబోతున్నాడు. అసలు ఆమె ఎలా ఉంటుందో? జాజిమల్లెంతటి సుకుమారంగా ఉంటుందో, మొగలిపువ్వులా మొరటుగా, అనంతమైన సువాసనను మదిలో నింపుకుని పైకి ఏమీ తెలియనట్లు అమాయకంగా ఉంటుందో? ఎన్నిసార్లు ఫొటో పంపమన్నా పంపలేదు. అయినా తాను ఆమె వ్యక్తిత్వాన్ని మెచ్చాడు కాబట్టి ఎలా ఉన్నా పెళ్లిచేసుకు తీరతాడు. ఇన్నాళ్లూ ఇలాంటి టెన్షన్‌ని, తొలి ప్రేమ భావాలను ఎన్నింటినో మనస్సుకు కట్టినట్టు తన రచనల్లో రాసాడు. కాని ఈ రోజు తను స్వయంగా అనుభవిస్తూంటే గమ్మత్తుగా ఉంది. ఇలా పరిపరి ఆలోచనలతో ఎప్పుడు ఆమెను చూద్దామా అన్న ఆతృతతో సరైన సమయానికి వచ్చిన ట్రైన్‌ని కూడా ఐదునిమిషాలు ఆలస్యంగా వచ్చిందని తిట్టుకున్నాడు.

స్టేషన్‌లో దిగగానే పెళ్లికి ఇంకా సమయం ఉండటంతో ముందు సరాసరి రవళి అడ్రస్‌కే బయల్దేరాడు. అట్టే కష్టపడకుండానే దొరికింది ఇల్లు. గేటు దాటగానే ఇంటి ముందు, గుమ్మం వరకూ సన్నని బాట కిరువైపులా రకరకాల పూలచెట్లు, ఆమె హృదయానికి దారి చూపుతూ ఆహ్వానం పలుకు తున్నాయనిపించిందతనికి.

బెల్ నొక్కగానే తెరుచుకున్న గుమ్మంలో... బహుశా పనిమనిషేమో... కుచ్చిళ్లు పైకి దోపుకుని... కొంచెం యాస మాటలతో 'ఎవురూ...' అంది.


"రవళి గారున్నారా..." ఇంకా పూర్తిగా అడగకముందే -

"తమరు మురళీకృష్ణ బాబుగారా?..." అంది.

తల అవునన్నట్టుగా ఊపాడు... అంటే తన గురించి, తను వస్తాననీ చెప్పి ఉంచిందన్న మాట.

'రండి' అంటూ మెట్లవైపుగా దారి తీసి... 'పైన ఉన్నారు వెళ్లండి...' అంటూ 'అమ్మగారూ... మురళీకృష్ణగారొచ్చారు...' అంటూ ఒక కేక వేసింది.

నెమ్మదిగా పైకి వెళ్లాడు. కుర్చీలోకూర్చుని, అటువైపు ముఖంచేసి ఉంది ఆమె. ముఖం ఎలా ఉంటుందో అనుకుంటూ కుతూహలంగా, ఒకింత భయంగా చూస్తున్న మురళీకృష్ణ ఆ అలికిడికి వెనుదిరిగిన ఆమె ముఖాన్ని చూసి ఒక్కసారిగా విభ్రాంతికి లోనయ్యాడు. కారణం ఎన్నిసార్లు 'చూస్తాను' అని తాను అన్నా, ఫొటో పంపించమన్నా వ్యతిరేకించిన ఆమె బహుశా అందంగా ఉండదేమో అన్న సంశయంలో ఉన్నాడిన్నాళ్లూ. కాని ఇప్పుడా సందేహం పటాపంచలయిపోయింది. జగన్మోహన సుందరిలా ఉందామె. చంద్రబింబంలాంటి ముఖంమీద తూనీగల్లా ముసురుకుంటున్న నల్లని ముంగురులు, చెలమలో తిరిగే చేపల్లాంటి కళ్లు, కోటేరు ముక్కు చిన్ననోరుతో బ్రహ్మదేవుడు ప్రత్యేకంగా




పాలమీగడలోని తెలుపు, చందనంలోని చల్ల దనం, మల్లెలలోని నాజూకుతనం, సంపెంగ లోని వయ్యారం కలబోసి రంగరించి నిష్టగా చేసిన కుందనపుబొమ్మలా ఉంది. ఎర్రటి పెదా లు పగడాలని సవాల్ చేస్తున్నట్లుగా ఉన్నాయి. బహుశా 'నడవలేదేమో... కూర్చుని లేవడం లేదు... అందుకే తనను రిసీవ్ చేసుకోవడానికి రాలేదు' అనుకుంటున్న అతని అనుమానాన్ని తుంచేస్తూ, అతన్ని చూడగానే తడబాటుగా లేచి నిల్చుని రెండు చేతులు జోడించింది నమస్కార మన్నట్లు – పలకరింపుగా చిరునవ్వు నవ్వుతూ.

మన మధ్య కూడానా అనుకుంటూ చేతులు జోడించాడు మురళీకృష్ణ. తలకిందికి వాల్చు కుని నిల్చున్న అమెను ఎంతో అబ్బురంగా చూసాడు. ఎంతో అమాయకంగా కనబడే ఈ ముగ్ధేనా, అన్నన్ని భావాలు వ్యక్తపరిచేది? చమ త్కారబాణాలతో తన మనస్సుని దోచిన ఈ జవ్వనేనా ఇప్పుడిలా ముడుచుకుపోయి ఏమీ తెలియనట్లు నిలుచుంది? కేవలం భాషలోనే మాటలకందని భావాన్ని నేరుగా మనస్సులోకి ఇంజెక్ట్ చేసి, తనలో సప్తస్వరాలను పలికించిన ఈ పుత్తడిబొమ్మేనా నేడు ఉలుకూపలుకూ లేకుండా నిలుచుంది? ఇలా ఆలోచిస్తూ సంభ్ర మంగా చూస్తున్న అతడు...

'నమస్కారమండీ మురళీకృష్ణగారూ!...' అన్న పిలుపుకి ఇహలోకంలోకి వచ్చి ఉలిక్కిపడి తల తిప్పి చూసాడు.

పరికిణీ ఓణీలో నవ్వుతూ నిలబడి ఉంది ఒక అమ్మాయి. పొరపాటున ఈ అమ్మాయి కాదు కదా రవళి? నో... ఎట్టిపరిస్థితుల్లోనూ కాదు. అయి ఉండదు. కాని అలా అని నమ్మక మేమిటి? మొదటి అమ్మాయి తనపేరు రవళి అనిగాని ఏమైనా చెప్పిందా? లేదే!... అమ్మో... రచయితనని, విక్రమార్కునికి పరీక్షపెట్టినట్లు పెట్టడం లేదు కదా? విక్రమార్క మహారాజయితే దేవీవరప్రసాదుడు. ఇట్టే రాజకుమారా, పరిచా రికా అని తెలుసుకోగలిగాడు. కానీ తాను

సామాన్య మానవుడు. అయినా తన సిక్స్త్‌సెన్స్ మొదటి అమ్మాయే రవళి అని చెబుతోంది. ఆమెని చూడగానే తనలో ఏదో గమ్మత్తయిన పులకరింత...

'ఏమిటి...? నిలుచునే కలల్లో తేలిపోతున్నారు. మీ పేరెలా తెలిసిందనుకుంటున్నారా! మా రవళి లేదటండీ! ఒక్క పేరేమిటి? మీ గురించిన ప్రతి విషయమూ తెలుసు. అన్నట్లు నేనెవరో చెప్పలేదు కదూ! రవళి స్నేహితురాల్ని పేరు రత్నమాల. అయ్యయ్యో!... నిలబెట్టేసే మాట్లాడుతున్నాను! కూర్చోండి! అంటూ 'ఇంతకీ పెళ్లికి వెళ్లరా?' అంది కుర్చీ జరుపుతూ.

'లేదు... అయినా... ఇదేంటి లెటర్స్‌లో అన్ని కబుర్లు చెప్పే మీ రవళి అలా మూగబోయిందేమిటి?' అన్నాడు రవళిని చూస్తూ మురళీకృష్ణ.

క్షణంలో విషాదంగా మారిపోయింది రత్నమాల ముఖం. 'అన్నట్లు మీకు తెలీదుకదూ! రవళికి మాటలు రావండీ. మా రవళి మూగ రవళి. నాకు కబుర్లు ఎలా చెప్పింది అంటారా? ఏ విషయమైనా రాసి చూపెడుతుంది. చిన్నప్పట్నుంచీ నాకు స్నేహితురాలు. పదవతరగతి తర్వాత ఆక్సిడెంట్‌లో మాటపోయింది. దాని భావాలు నాకు అర్ధమవుతాయి. ఇంతకాలం ఏ కృష్ణుడో వచ్చి మూగరవళిలో రాగాలు పలికిస్తాడని, అండగా నిలిచి తానే తన నాద మౌతాడని ఎదురుచూసాము. ఇప్పుడు ఇక మీ ఇష్టం. మీ భావాన్ని నిర్భయంగా చెప్పవచ్చు' అంది రత్నమాల.


నిశ్చేష్టుడయ్యాడు మురళీకృష్ణ. అసలలాంటి విషయాన్ని తానెంత మాత్రం ఊహించలేదు. ఎన్నో చిలిపి, మధురసంభాషణల్లాంటి లేఖలతో తనను ఊరించిన రవళి మూగది అనగానే మనస్సు కలిచివేసినట్లనిపించింది.

'మీ నిర్ణయం ఎలా ఉన్నా మాకేం అభ్యంతరం లేదు. అయినా పెళ్లిచేసుకొమ్మనటం కూడా అత్యాశేలెండి. పైగా ఉదారస్వభావంతో, జాలితో మాత్రం తనను పెళ్లిచేసుకోవద్దని రవళి మరీ మరీ చెప్పింది. మీ అభిప్రాయం కూడా వెంటనే చెప్పనవసరం లేదు. మీకిష్టమైనంత టైమ్ తీసుకోవచ్చు' అంది రత్న మళ్లీ.

ఒక ఐదు నిమిషాలు మౌనంగా భారంగా గడిచిపోయాయి.

'ఇందులో అంతగా ఆలోచించడానికేం లేదు. నేను బాహ్యసౌందర్యాన్ని చూసి ప్రేమించలేదు. ఆమె భావాలను ప్రేమించాను. ఆమె మనసుని ప్రేమించాను. నేను బ్రతికి ఉన్నంత వరకూ, 'మాటలు రాలేదే' అని తను ఎన్నడూ బాధపడని విధంగా చూసుకుంటాను. ఇది ఉడుకు రక్తంతో, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం కాదు. ఇది నా ధృఢ నిర్ణయం' అనగానే ఫక్కున నవ్వుతున్న రవళివైపు, దానిమ్మ గింజల్లాంటి ఆమె పలువరుసవైపూ సమ్మోహితుడై చూస్తుండగానే, ఆమె అతని దగ్గరగా వచ్చి అతని చేయి తన చేతిలోకి తీసుకుని సుతారంగా పెదవుల కానించుకుని 'థాంక్యూ' అంటూ అతని చేతిలో ఒక పేపర్‌పెట్టి పక్క గదిలోకి పరిగెత్తింది.

శరీరంలోకి ఒక్కసారిగా కరెంట్ ప్రవహించినట్లనిపించింది మురళీకృష్ణకు. ఆ తర్వాత 'ఆమె... మాట్లాడింది...' అన్న విషయం అతనికి అర్థం కావడానికి... ఒక నిమిషం పట్టింది. అయోమయంగా చేతిలోని పేపర్‌లో చూసాడు. అందులో 'ఏప్రిల్ ఫూల్' అని రాసి ఉంది. ఫూల్ ఇంగ్లీష్‌లో రాసి ఉన్న దానిలోని రెండు సున్నాలలో పకపక నవ్వుతున్నట్లున్న జోక




తలలు చిత్రించబడి ఉన్నాయి. క్రింద 'సారీ... రవళి' అన్న అక్షరాలు చిన్నగా అందంగా రాయబడి ఉన్నాయి. తను ఈ సంతోషంలో ఆ విషయం మరిచాడు. ప్రతి సంవత్సరం గుర్తుంటుంది. ఇంతవరకెపుడూ 'ఏప్రిల్‌ఫూల్' కాలేదు. ఎందర్నో చేసాడుకానీ. కించిత్ ఎర్రబడ్డముఖంతో రత్నవైపు చూసాడు. ఇంటికి మొదటిసారిగా వచ్చిన అతిధిని ఇలా అయోమయంలో పడేసి, ఇలా సత్కరించడం భావ్యమా!' అన్నట్లుగా.

'క్షమించండి... మేము మా చిలిపిసరదాలకి మీ మనసునేమైనా నొప్పిస్తే. మనస్ఫూర్తిగా క్షమాపణ వేడుకుంటున్నాం. నేను, రవళి బెట్ కట్టుకున్నాం. 'రచయిత ఆదర్శాల గురించి రాసినట్లు ఆచరించరు' అని నేను, 'మీరు మాత్రం అందుకు భిన్నమయిన వారని' రవళీ వాదించుకున్నాం. మీరు వస్తున్నారన్న లెటర్ రాగానే ఇది నిరూపించడానికి మంచి సమయమని తనే ఈ ఆలోచన చెప్పింది. 'మూగలా నటిస్తే నిన్ను చేసుకోరని' నేనంటే 'మీరు మాత్రం అలా కాదని' రవళి అంది. బెట్ అంటే బెట్ అనుకున్నాం. పైగా ఒకసారి మీరు పత్రికల కిచ్చిన ఇంటర్వ్యూలో మీ చిన్నప్పటి విషయాలు చెబుతూ, చిన్నప్పుడు మీ అక్కచెల్లెళ్లు, స్నేహితులు అంతా మిమ్మల్ని ఏప్రిల్‌ఫూల్ చేయాలనుకుని ఎవరూ చేయలేక పోయారని, ఇప్పటి ఎవరూ చేయలేదని... మాటల సందర్భంగా అన్న విషయం గుర్తుంచుకుని, రవళి మీ జీవితంలో అలా చేసిన మనిషిగా తను ప్రత్యేకస్థానం పొందాలనుకుంది. మొత్తానికి తానే గెలిచింది... మిమ్మల్ని గెలుచుకుంది' అంది రత్నమాల.

స్వీట్, కాఫీ పట్టుకొస్తున్న రవళి, 'మీ మనస్సును నొప్పిస్తే క్షమించండి... ఏదో తెలిసీ తెలియనితనం...' అంటుంటే 'అమ్మదొంగా! నీది తెలిసీ తెలియనితనమా... మొత్తానికి పరీక్ష నాకు పెట్టి... నీ సంగతి తర్వాత చూస్తాలే' అన్నాడు మురళీకృష్ణ నవ్వుతూ. అతనితో శృతికలిపారిద్దరూ. ●